ఆలయాల ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

చిత్తూరు కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా దేవదాయశాఖలో ఆలయాల ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న సుమనప్రియను అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ సస్పెండ్ చేశారు.గత నెల 30వ తేది ప్రముఖ శైవక్షేత్రమైన మొగిలీశ్వర ఆలయ హుండీ లెక్కింపు సందర్భంగా రూ. 13 వేలు ఆమె తస్కరిస్తుండగా తాము గుర్తించినట్లు స్థానికులు చిట్టెమ్మకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.ఈ విషయమై చిట్టెమ్మ జూన్ 1వ తేది విచారణ నిర్వహించారు.అనంతరం నివేదికను కర్నూలులోని ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్‌కు పంపగా సుమనప్రియను సస్పెండ్ చేస్తూ బుధవారం రాత్రి ఆదేశాలు వెలువడ్డాయి.అయితే ఏసీ చిట్టెమ్మ సరైన విచారణ జరపకుండానే తనపై నివేదిక పంపారని,దానిపైన డీసీ కూడా సమగ్ర విచారణ చేపట్టకుండా సస్పెండ్ చేయడం సమంజసం కాదని సుమనప్రియ వాదిస్తున్నారు.ఆమె ఎన్జీవో అసోసియేషన్ నాయకురాలు కూడా రావడంతో ఉద్యోగ సంఘాల నాయకులు ఆమెకు మద్దతుగా మాట్లాడుతున్నారు.ఈ విషయమై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయన్నుట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు రాఘవులు, కిరణ్, జగదీష్ తెలిపారు.

నేటినుంచి డీఎస్సీ పరీక్షలు

జిల్లాలో 4, చెన్నైలో 4 కేంద్రాలు ● గ్రీవెన్స్ సెల్ నెంబరు 90321 85001

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ మెగా డీఎస్సీ పరీక్షలు శుక్రవారం నుంచి జరగనున్నాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈనెల 30వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షలకు జిల్లాకు సంబంధించి ఎనిమిది పరీక్ష కేంద్రాలు మంజూరయ్యాయని చెప్పారు. వీటిల్లో చిత్తూరు జిల్లాలో నాలుగు, చెన్నైలో నాలుగు ఉన్నాయన్నారు. జిల్లాలో 22,046 మంది, చెన్నైలో 1484 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు వివరించారు. సందేహాలు, ఫిర్యాదులు, సలహాలకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ నెంబరు 90321 85001 ఏర్పాటు చేశామన్నారు.

చిత్తూరు జిల్లాలో పరీక్ష కేంద్రాలు

- శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ (సీటమ్స్), మురకంబట్టు, చిత్తూరు.
- శ్రీవేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (ఎస్వీసెట్), ఆర్వీఎస్ నగర్, చిత్తూరు.
- వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పి.కొత్తకోట, చిత్తూరు - తిరుపతి హైవే, చిత్తూరు.
- మదర్‌థెరిస్సా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, పలమనేరు.

చెన్నైలో పరీక్ష కేంద్రాలు

- బ్లూ లోటస్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, నెహ్రూ నగర్, ఓఎంఆర్ రోడ్, చెన్నై, టి.ఎన్- 600041.
- చెవాలియర్ టి.థామస్ ఎలిజిబెత్ కాలేజ్ ఫర్ ఉమెన్, మేరీల్యాండ్, సెంబియన్, పెరంబూరు, చెన్నై, టి.ఎన్. - 600011.
- మహాలక్ష్మి టెక్ క్యాంపస్, నెం.1, భారతియార్ స్ట్రీట్, ప్రశాంతి నగర్, చెన్నై, టి.ఎన్ - 600044.
- ప్రిన్స్ డా. కె.వాసుదేవన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, మాంబాక్కమ్, మేడవాక్కం మెయిన్ రోడ్డు, చెంగల్పట్టు డిస్ట్రిక్, చెన్నై, టి.ఎన్ - 600127.

సీఎం జిల్లాకూ అరకొర కేటాయింపులు!

- వేరుశనగ విత్తన కాయల కోటాలో భారీ కోత
- గతేడాది 43 వేలైతే ఈసారి 26 వేల క్వింటాళ్లే
- రైతులకు సమాధానం చెప్పలేక అధికారుల సతమతం
- సాగుపై ప్రభావం పడే అవకాశం



● విత్తనాల కేటాయింపు (క్వింటాళ్లలో..)

జిల్లాకు వచ్చిన విత్తనాలు: 26,500

గతేడాది పంపిణీ చేసింది: 43 వేలు

అదనపు కోటా కోసం ప్రతిపాదనలు: 14 వేలు

ఈ ఏడాది సాగు: 88 వేల ఎకరాలు

చిత్తూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా సీఎం జిల్లా అంటే పథకాల అమలుకు ప్రాధాన్యముంటుంది. అలాగే అధికంగా నిధులు కేటాయింపులూ జరుగుతుంటాయి. అయితే ఈసారి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తనాల కేటాయింపు చూస్తుంటే జిల్లాకు భారీగా కోత పెట్టారు. గతేడాది 43 వేల క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేస్తే, ఈసారి జిల్లాకు 26 వేల క్వింటాళ్ల మాత్రమే కేటాయించారు.

● క్షేత్రస్థాయిలో సరిపోక సతమతం

గుడిపాల మండలంలో గతేడాది 986 క్వింటాళ్ల విత్తన కాయలను పంపిణీ చేయగా, ఈసారి 642 క్వింటాళ్లను మాత్రమే కేటాయించారు. ఈ మండలంలోని పాపసముద్రం గ్రామంలో గతేడాది 75 క్వింటాళ్లను పంపిణీ చేయగా.. ఈసారి 42 క్వింటాళ్లనే ఇచ్చారు. ఇదే పరిస్థితి మిగిలిన మండలాల్లో కూడా ఉంది.విత్తన కాయలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు సమాధానాలు చెప్పలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండో దఫా పంపిణీ ఉంటుందని నచ్చచెబుతున్నారు.

● ఎంత సాగు చేసినా రైతుకు ఓ బస్తానే

ఎకరా వేరుశనగ సాగుకు 90 కిలోల నుంచి 120 కిలోల విత్తనాలు అవసరం. బస్తాకు 30 కిలోల కాయలుంటే అందులో నుంచి విత్తనాలు సుమారు 22 నుంచి 24 కిలోలు వస్తాయి. అంటే రెండెకరాలున్న రైతుకు కనీసం 8 బస్తాల విత్తన కాయలు అందించాలి. కానీ, రైతుకు ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నా.. ఓ బస్తా (30 కిలోల) కాయలు మాత్రమే ఇస్తున్నారు. అంటే రైతు మళ్లీ కచ్చితంగా బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

● వాతావరణం అనుకూలిస్తున్నా..

ఈ ఏడాది ఖరీఫ్‌కు వర్షాలు అనుకూలిస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది. ఇలాంటి తరుణంలో విత్తనాల పంపిణీ అరకొరగా చేస్తే రైతులకు తీరని నష్టం చేసినవారవుతారు. కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి అదనపు కేటాయింపుల కోసం రాష్ట్ర అధికారులకు ప్రతిపాదనలు పంపించినా ఫలితం కనిపించలేదు. ఇన్‌ఛార్జి మంత్రి, ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని పోరాడితేనే రైతులకు మేలు చేసినవారవుతారు.

● ఎమ్మెల్యే మురళి చొరవ

పూతలపట్టు నియోజకవర్గంలో 5 మండలాలుండగా.. 1590 క్వింటాళ్ల విత్తన కాయలను కేటాయించారు. ఈ నియోజకవర్గంలో సాగు అధికం కావడంతో ఇవి ఏ మాత్రం సరిపోవు. దీంతో ఎమ్మెల్యే మురళీమోహన్ చొరవ తీసుకుని బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడితో మాట్లాడారు.తమ నియోజకవర్గంలో అధికంగా సాగు చేస్తున్న కారణంగా కచ్చితంగా రెట్టింపు కేటాయింపులు కావాలని కోరారు. దీంతో మంత్రి వెంటనే అధికారులకు చెప్పి పరిష్కారానికి ఆదేశించారు. దీంతో పాటు ఎమ్మెల్యే జిల్లా, మండల వ్యవసాయాధికారులతో నిత్యం మాట్లాడుతూ.. పంపిణీలో జాగ్రత్తలు పాటించి కాయలు వృథా కాకుండా చూడాలని ఆదేశిస్తున్నారు. సోమవారం నుంచి రెట్టింపు కాయలు పంపిణీ చేసే అవకాశముంది.

● జడ్పీ మీటింగులోనూ చర్చ..

గత నెల 13న జరిగిన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కూడా వేరుశనగ విత్తనాల గురించి చర్చ జరిగింది. సీజన్ సమీపిస్తున్నా విత్తనాల పంపిణీ ఆలస్యమవుతోందని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు ప్రస్తావించగా.. గతేడాది 43వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేయగా, ఈఏడాది అందులో సగం మాత్రమే జిల్లాకు కేటాయించారని అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ ఏడాది గతం కన్నా అధికంగా పంపిణీ చేయాలని జడ్పీ ఛైర్మన్ సూచించారు.



చిత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న డీఈవో వరలక్ష్మి తదితరులు

నేటినుంచి ఎస్జీటీ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ

చిత్తూరు సెంట్రల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతి, బదిలీల ప్రక్రియను గురువారానికి పూర్తి చేశారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాలతో శుక్రవారం నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీల) పదోన్నతులు, బదిలీల ప్రక్రియను చేపట్టనున్నారు. వీరికి సంబంధించిన సీనియారిటీ జాబితాను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి నుంచి ఆదేశాలు రాగానే ఎస్జీటీల సర్టిఫికెట్ల పరిశీలన, పదోన్నతులు చేపడతారు. ఆపై ఖాళీలు గుర్తించి బదిలీలు చేయనున్నారు. ఇక ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈవో వరలక్ష్మి, డీవైఈవోలు, ఎంఈవోలు మొక్కలు నాటారు.



కొనుగోళ్లు లేక మ్యాంగోనగర్ మండీల్లో మగ్గుతున్న తోతాపురి

మద్దతు ధర ప్రకటనలకే పరిమితం

కొనుగోళ్లు ప్రారంభించని గుజ్జు పరిశ్రమలు

పాకాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో రైతులు సాగుచేసిన తోతాపురి మామిడికి మద్దతు ధర ప్రకటనలకే పరిమితమైంది.ఈ నెల 3వ తేదీ చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు, ఎమ్మెల్యేలు తోతాపురి మామిడికి ధర నిర్ణయించడంతో రైతులు సంతోషపడ్డారు. కోతకూలీలు, రవాణా ఖర్చులైనా దక్కుతాయనుకున్నారు. 5వ తేది నుంచి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని సంబరపడ్డారు. అయితే గురువారం కూడా గుజ్జుపరిశ్రమల కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. ఎప్పుడు కొనుగోళ్లు ప్రారంభిస్తారో కూడా తెలియని పరిస్థితి. మరోవైపు ఇటీవల కురిసిన వర్షాలకు తోటల్లో తోతాపురి కాయలు పక్వానికివచ్చి రాలిపోతున్నాయి. కాయలు కోసి మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు మండీల్లో, గుజ్జుపరిశ్రమల్లో కొనుగోలు చేయకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచక ఇబ్బంది పడుతున్నారు. మండీ ర్యాంపులవద్ద టన్ను రూ.5వేలకు కొనేందుకు కూడా వ్యాపారులు మొగ్గు చూపడం లేదు.ఎందుకంటే మండీల్లో తోతాపురి అమ్ముడుపోక మగ్గుతున్నాయి.

తోతాపురి టన్ను రూ.5వేలే

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- ఫ్యాక్టరీ ముందు రైతుల నిరసన



తాసా ఫ్యాక్టరీ వద్ద నిరసన చేపడుతున్న మామిడి రైతులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తోతాపురి రకం మామిడి టన్నుకు రూ.12వేలను గిట్టుబాటు ధర నిర్ణయిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల జారీ చేసిన విషయం తెలిసిందే. మద్దతు ధర ప్రకటించి రెండ్రోజులైనా కాకముందే జిల్లాలోని ఆర్ఎంఎం, తాసా ఫ్యాక్టరీ యాజమాన్యాలు కలెక్టర్ ఆదేశాలను ఉల్లంఘించాయి. గురువారం వేలూరు రోడ్డులోని ఆర్ఎంఎం, తాసా ఫ్యాక్టరీకి 90 టన్నులు, పుత్తూరులోని తాసా ఫ్యాక్టరీకి 45 టన్నుల తోతాపురి కాయలు వచ్చాయి. రాయచోటి, కోడూరు మార్కెట్ యార్డుల నుంచి వచ్చిన ఈ తోతాపురి కాయలకు రూ.12వేలకు కాకుండా రూ.5వేలకే ఈ ఫ్యాక్టరీల యాజమాన్యాలు కొనుగోలు చేశాయి. మరోవైపు తక్కువ ధరకు మరిన్ని లోడ్లు బయట జిల్లాలు, పక్క రాష్ట్రాల నుంచి మామిడిని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. దీనిపై స్పందించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి ధరల స్థిరీకరణ కమిటీ కన్వీనర్ ఆనందనాయుడు ఆధ్వర్యంలో రైతులు వెంకటరెడ్డి, హరిబాబు చౌదరి, త్యాగరాజరెడ్డి, లవకుమార్, చిత్తూరు రూరల్‌నుంచి మరో 10మంది కలిసి తాసా ఫ్యాక్టరీ ముందు నిరసన తెలిపారు. బయట ప్రాంతాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేయడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన మరోమారు జిల్లాలోని గుజ్జు పరిశ్రమ యాజమాన్యాలు, మామిడి రైతులను పిలిపించి చర్చలు జరిపినట్లు సమాచారం.



పిల్లలు మునిగిపోయిన చెరువులోని కుంట

ఈత సరదాకు ముగ్గురు పిల్లల బలి

వి.కోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. వి.కోట మండలం కృష్ణాపురం పంచాయతీ మోట్లపల్లెలో ఈ విషాదం చోటుచేసుకుంది.మోట్లపల్లెకు చెందిన ఆదెప్ప కుమారులు పూర్ణేష్(14), జగన్(11),ఆదెప్ప చెల్లెలు కవిత కుమారుడు నిఖిల్(13), రెడ్డెప్ప కుమారుడు కుశల్(11), గురువారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని చెరువులో ఈత నేర్చుకునేందుకు వెళ్లారు.వీరిలో పూర్ణేష్‌కు మాత్రమే ఈత వచ్చు. మిగిలిన ముగ్గురూ ఈత నేర్చుకుంటున్నారు.



ప్రాణాలు కోల్పోయిన నిఖిల్, కుశల్, జగన్(ఫైల్ ఫొటోలు)



మృతదేహాల వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

చెరువు మధ్యలో వున్న నీటికుంటలో ఈతకోసం దిగిన వారిలో లోతైన ప్రాంతానికి వెళ్లిపోవడంతో ముగ్గురు బయటకు రాలేక పోయారు. ప్రమాదాన్ని పసిగట్టిన పూర్ణేష్ బయటకు వచ్చి తీగల సాయంతో మునిగిపోతున్న వారిని బయటకు లాగేందుకు ప్రయత్నించాడు.అయితే ఆ ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో గ్రామానికి చేరుకుని ప్రమాదం గురించి చెప్పాడు.అందరూ కలిసి నీటికుంట వద్దకు చేరుకుని ముగ్గురినీ బయటకు లాగారు. అయితే అప్పటికే ఇద్దరు పిల్లలు మృతి చెందారు.జగన్‌కు కాస్త ఊపిరి ఆడుతోందని గ్రహించి వి.కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆ బాలుడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.మృతి చెందిన పిల్లలు కృష్ణాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఆరవ తరగతి, ఒకరు ఎనిమిదవ తరగతి పూర్తి చేశారు. విద్యార్థుల మృతి విషయం తెలుసుకున్న సీఐ సోమశేఖర రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.ముగ్గురు పిల్లలు ఒకేసారి మృత్యువాత పడడంతో మోట్లపల్లె శోకసంద్రంగా మారింది. మృతి చెందిన పిల్లల వద్ద వారి కుటుంబీకులు, బంధుగణం రోదనలు చూపరులను కలచివేశాయి.ఆదెప్పకు ఇద్దరు కుమారులుండగా ఒకరు, రెడ్డెప్పకు కుమార్తె, కుమారుడు ఉండగా కుమారుడు, కవితకు కుమారుడు, కుమార్తె ఉండగా కొడుకు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల వద్దకు పిల్లల్ని పంపినప్పుడు తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



ఘటనా స్థలం వద్ద గుమిగూడిన గ్రామస్థులు



దొంగతనం జరిగిన దుకాణాలు

చిత్తూరులో దొంగలు పడ్డారు

ఓ దుకాణంలో రూ.2లక్షల చిల్లర నాణేలు, మరో దుకాణంలో రూ.11 లక్షల బంగారం, వెండి అపహరణ

చిత్తూరు అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో బుధవారం అర్ధరాత్రి రెండు దుకాణాల్లో దొంగలు పడ్డారు. ఓ దుకాణంలో రూ.2లక్షల చిల్లర నాణేలు, మరో దుకాణంలో రూ.11లక్షల విలువైన బంగారం, వెండిని అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జెండామాను వీధిలోని రంగా సన్స్ అండ్ స్టీల్ మార్ట్, శరవణ జ్యువెలర్స్ పక్కపక్కనే ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి దొంగలు మొదట రంగా స్టీల్‌మార్ట్ భవనంలోని నాల్గవ అంతస్తులోకి చొరబడ్డారు. అక్కడ కొంతకాలంగా వ్యాపారంలో భాగంగా రోజువారీగా వచ్చే చిల్లర నాణేలు రూ.2లక్షల వరకు కనిపించాయి. వాటిని తీసుకున్నారు. తర్వాత ఆ భవనాన్ని ఆనుకుని ఉన్న శరవణ జ్యువెలర్స్ దుకాణం మిద్దెపైకి వెళ్లారు. అక్కడినుంచి దుకాణంలోకి నిచ్చెన కనిపించడంతో దాని సాయంతో లోపలికెళ్లారు. జ్యువెలర్స్‌లో ఉన్న సుమారు రూ.11లక్షల విలువైన 120 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండిని ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం రెండు దుకాణాల వారు దొంగతనాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీములు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించాయి. ఎస్పీ మణికంఠ కూడా సంఘటన స్థలానికి చేరుకున్నారు. దొంగతనం జరిగిన తీరును సీఐలు నెట్టికంఠయ్య, మహేశ్వర్‌లు ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.



'రంగా సన్స్'ను సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

ఆధారాలు లభించినట్లు సమాచారం

దొంగతనంపై పోలీసులకు స్పష్టమైన ఆధారాలు లభించినట్లు సమాచారం. దొంగల ఫొటోలను ఇప్పటికే సేకరించినట్లు తెలిసింది. వీరు తమిళనాడు లేదా కర్ణాటక రాష్ట్రానికి చెందినవారై ఉంటారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

9 నుంచి శ్రీవారి ఆలయంలో జ్యేష్టాభిషేకం

తిరుమల, జూన్5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు సాలకట్ల జ్యేష్టాభిషేకం జరగనుంది. శ్రీవారి ఆలయం సంపంగి ప్రదక్షిణ ప్రాకారంలోని కల్యాణమండపంలో నిర్వహించే ఈ క్రతువును 'అభిద్యేయక అభిషేకం' అని కూడా అంటారు. తరతరాలుగా అభిషేకాలతో అత్యంత ప్రాచీనమైన స్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించేందుకు ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. మొదటిరోజు శ్రీమలయప్ప స్వామికి ఉండే బంగారు కవచాన్ని తొలగించి హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఆ తర్వాత స్వామికివారికి వజ్రకవచాన్ని అలంకరించి సాయంత్రం ఊరేగిస్తారు. ఇక రెండవరోజు ముత్యాల కవచం సమర్పిస్తారు. చివరిరోజు తిరుమంజనాదులు పూర్తిచేసి తిరిగి బంగారు కవచాన్ని సమర్పిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్టాభిషేకంలోనే తీస్తారు. అంతవరకు ఏడాది పొడవునా శ్రీవారు బంగారు కవచంతోనే వివిధ ఉత్సవాల్లో పాల్గొంటారు.


తిరుమలకు మెరుగైన భద్రత

● టీటీడీ నూతన సీవీఎస్వో మురళీకృష్ణ



తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గతంలో డీఎస్పీగా, అదనపు ఎస్పీగా పనిచేసిన అనుభవాన్ని ఉపయోగించుకుని భక్తులకు, తిరుమల క్షేత్రానికి మెరుగైన భద్రతను కల్పించేలా విధులు నిర్వహిస్తానని టీటీడీ నూతన సీవీఎస్వోగా కేవీ మురళీకృష్ణ తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల టీటీడీ తీసుకున్న నిర్ణయాలను అర్థం చేసుకుని భద్రత పెంపుకోసం చర్యలు తీసుకుంటామన్నారు. టెక్నాలజీని కూడా వినియోగించుకుని ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఇంత బాధ్యతాయుతమైన ఉద్యోగాన్ని నిర్వర్తించేందుకు అవకాశం కల్పించిన స్వామివారితో పాటు సీఎం, డిప్యూటీసీఎం, సీఎస్, డీజీపీకి ధన్యవాదాలు తెలిపారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల, జూన్5(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.67 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,288

తలనీలాలు సమర్పించినవారు: 32,079

అమ్మ ముఖంలో ఆనందం



బయటి నుంచి కొనుగోలు చేసిన బేబీ బెడ్స్‌లో పురిటి బిడ్డలను ఆస్పత్రి నుంచి తీసుకువెళుతున్న తల్లులు

పంపిణీకి సిద్ధం చేస్తున్న బేబీ కిట్లు



పసికందుల సంరక్షణకు ప్రభుత్వం శ్రీకారం

ఎన్టీఆర్ బేబీ కిట్ల పునరుద్ధరణకు ఏర్పాట్లు

ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకాన్ని పునరుద్ధరించాలనే నిర్ణయం పేదతల్లుల్లో ఆనందాన్ని నింపనుంది. ప్రసవానికి ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవారిలో ఎక్కువమంది పేదవారే. ప్రసవానంతం రూ.500 ఖర్చు పెట్టి పసికందును తీసుకువెళ్లలేని దైన్యస్థితిని ఎదుర్కొనేవారే. ఈ పరిస్థితిని గుర్తించిన టీడీపీ ప్రభుత్వం గతంలో ఎన్టీఆర్ బేబీ కిట్లను ఉచితంగా అందించేది. ఈ బేబీ కిట్ విలువ కనీసం రూ.1,500 వరకు ఉండేది. ఇందులో బేబీ టవల్, బెడ్, లిక్విడ్ సోప్, దోమ తెర ఉండేవి. పురిటి బిడ్డల సంరక్షణకు ఇవి ఉపయోగపడేవి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకూ పరోక్షంగా దోహదపడేది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

ఆ ఐదేళ్లూ కిట్లు ఇస్తే ఒట్టు

2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పథకం పేరు మార్చింది గానీ కిట్లను మాత్రం అందించలేకపోయింది ఏడాదిలోనే పూర్తిగా స్వస్తి పలికేసింది. దీంతో ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకున్న తల్లులు ఇబ్బందిపడేవారు. ప్రసవానంతరం కొందరు పాత దుప్పట్లను ఉపయోగించే వారు. దీనివలన పిల్లలు ఇన్‌ఫెక్షన్ల బారిన పడే అవకాశాలుండేవి. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 102 పీహెచ్‌సీలు, 16 సీహెచ్‌సీలు, నాలుగు ఏరియా ఆస్పత్రులు, రెండు జిల్లా ఆస్పత్రుల పరిధిలో ఏటా 40 వేలకు పైగా ప్రసవాలు జరుగుతాయి. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోనే ఏటా దాదాపు 20 వేలకు పైగా ప్రసవాలు జరుగుతాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఎన్టీఆర్ బేబీ కిట్లకు ఏటా రూ.6 కోట్లను ఖర్చు చేయనుంది. ఈదిశగా ఇప్పటికే చర్యలను వేగవంతం చేసింది. త్వరలోనే బేబీకిట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తిరుపతి ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి తెలిపారు.

స్టూడెంట్ కిట్స్ గతంకంటే నాణ్యంగా ఉన్నాయి

కిట్స్ స్టాక్ పాయింట్లను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకురాలు అనురాధ




బ్యాగ్స్ నాణ్యతను పరిశీలిస్తున్న అనురాధ

తిరుపతి(విద్య), జూన్ 5(ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ కిట్స్ గత ఏడాదికంటే నాణ్యంగా ఉన్నాయని రాష్ట్ర పరిశీలకులు, అమరావతి సమగ్ర శిక్ష డిప్యూటీ డైరెక్టర్ అనురాధ పేర్కొన్నారు. గురువారం ఆమె చంద్రగిరి, రేణిగుంట, తిరుపతి రూరల్, అర్బన్, ఏర్పేడు ప్రాంతాల్లోని స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్లను పరిశీలించారు. టెక్స్, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, పిక్టోరియల్ డిక్షనరీ, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, బ్యాగ్, బెల్ట్, షూస్, మూడు జతల యూనిఫాం క్లాత్ నాణ్యతను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ షూలు, యూనిఫాం తప్ప మిగిలిన అన్ని వస్తువులు ఇప్పటికే పాఠశాలలకు చేరాయని చెప్పారు. అనంతరం తిరుపతి అర్బన్ మండలంలో జరుగుతున్న సీసీహెచ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ సురేష్, మండల విద్యాశాఖ అధికారులు, సీఆర్పీలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం ఎంపీడీవోకు పదోన్నతి

తిరుపతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం ఎంపీడీవో బి.ఇందిరమ్మకు ప్రభుత్వం డీఎల్‌డీవో (డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)గా పదోన్నతి కల్పించింది. వాస్తవానికి ఆమెకు 2021-22లోనే ఈ పదోన్నతి లభించింది. అయితే ఇందిరమ్మతో సహా రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు ఎంపీడీవోలకు అప్పట్లో డీఎల్‌డీవో పోస్టులు ఇవ్వకుండా ప్రభుత్వం పెండింగులో ఉంచింది. ఈ ముగ్గురిపై శాఖాపరమైన విచారణ పెండింగులో ఉండడం వల్ల ప్రభుత్వం ఆ మేరకు నిర్ణయం తీసుకుంది. అయితే తదుపరి విచారణలో ఈ ముగ్గురిపై వచ్చిన ఆరోపణలు నిరూపణ కాకపోవడంతో పదోన్నతికి అడ్డంకులు తొలగిపోయాయి. ఆ క్రమంలో ప్రభుత్వం ఇందిరమ్మ సహా ముగ్గురికీ డీఎల్‌డీవోగా పదోన్నతి కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ పదోన్నతి తాత్కాలిక ప్రాతిపదికన చేపడుతున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. పోస్టింగ్ కోసం పీఆర్ శాఖ ముఖ్య కార్యదర్శికి రిపోర్టు చేయాలని ఆదేశించింది.

కల్పవృక్షంపై గోవిందుడి విహారం





తిరుపతిఅర్బన్, జూన్5(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంపై విహరించి భక్తులను కటాక్షించారు. వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా..భక్తజన బృందాల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం 10-11గంటల వరకు స్వామి. అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పలు రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. రాత్రి 7-9గంటల వరకు సర్వభూపాల వాహనంపై స్వామివారు భక్తులకు అభయమిచ్చారు. కాగా శుక్రవారం రాత్రి 7-10గంటల వరకు స్వామివారి గరుడ సేవ జరగనుంది.

రేపటి నుంచి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు



అమ్మవారి పుష్కరణితో తెప్పలను ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

తిరుచానూరు అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు శనివారం నుంచి ఐదు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. మొదటి రోజు శనివారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండవ రోజు సుందరరాజస్వామి, మిగిలిన మూడు రోజుల పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు. రాత్రి 7.30గంటలపై ఊరేగే ఉత్సవర్లు తిరుమాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. 10వ తేదీ రాత్రి 8.30గంటలకు అమ్మవారి గజవాహనసేవ, 11న అమ్మవారు గరుడ వాహనంపై ఊరేగి భక్తులకు అభయమివ్వనున్నారు. తెప్పోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా తెప్పోత్సవాలను పురస్కరించుకుని పద్మసరోవరంలో ఇంజనీరింగ్ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

కొవిడ్ కట్టడిపై మాక్‌డ్రిల్



రుయాలో కొవిడ్ పరీక్ష చేస్తున్న వైద్యులు

తిరుపతి(వైద్యం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొవిడ్ కేసు నమోదు కావడంతో.. కట్టడికి ముందస్తు చర్యలు ఎలా చేపట్టాలనే అంశంపై అన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో భాగంగా రుయాస్పత్రిలో సూపరింటెండెంట్ రాధ ఆధ్వర్యంలో ఈ మాక్‌డ్రిల్ జరిగింది. కొవిడ్ పరీక్షలు ఎలా నిర్వహించాలి? శాంపుల్స్ ఎలా సేకరించాలి? అవసరమైన మందులు ఎలా సిద్ధం చేసుకోవాలి? ఎలాంటి వైద్యం అందించాలి అనే అంశాలపై ఈ కార్యక్రమం జరిగింది. ప్రత్యేక వైద్యులతో పలువురు సిబ్బందికి కొవిడ్ పరీక్షలు చేయించారు. కొవిడ్ నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అన్నీ పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, ఏరియా, ప్రాంతీయ ఆస్పత్రుల్లోనూ డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ ఆదేశాల మేరకు కొవిడ్ కట్టడిపై మాక్‌డ్రిల్ నిర్వహించారు.

మిగులు భూములను పచ్చగా మారుద్దాం

● బైరాజుల కండ్రిగలో కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటిన ఎమ్మెల్యే



మొక్కలకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్

కేవీబీపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి అనుసంధానం చేస్తూ మిగులు భూముల్లో మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తున్నట్లు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. కేవీబీపురం మండలం బైరాజులకండ్రిగ వద్ద డీఎఫ్‌వో విజయ, ఎఫ్ఆర్వో సెల్వం, అటవీ సిబ్బంది గురువారం ఏర్పాటు చేసిన వనమహోత్సవంలో ఆయన కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటారు. రానున్న కాలంలో మండలం పెద్ద పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు. మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం గొప్పతనమని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక అభివృద్ధి పర్యావరణ కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు. ఇందుకు సంబంధించి అటవీ సిబ్బంది, పరిసర గ్రామస్తులు ఈ ప్రాంతంలో వెయ్యి మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో సుమారు 5లక్షల మొక్కలు నాటి బతికించాలని కోరారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డితో కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిప్రదక్షిణకు సమీపంలోని ఈ ప్రాంతాన్ని, రెండున్నర కిలోమీటర్ల రోడ్డును ఎన్ఆర్‌డీఎస్ ద్వారా నిధులు వెచ్చించి అనుసంధానం చేయాలని సూచించారు. జిల్లా పర్యావరణంలో పచ్చదనంలో రెండవ స్థానంలో ఉందన్నారు. ఇకపై మండల స్థాయిలో నర్సరీలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తుందని, అవసరమైన మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, వెంకటగిరి ఎఫ్ఆర్వో శివశంకర్‌రెడ్డి, ఎంపీడీవో మాలతి, ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్, ఆర్ఐ కరుణాకర్, అటవీ, రెవెన్యూ సిబ్బందితో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు, తిరుపతి పార్లమెంటరీ రైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, సర్పంచులు విజయ్, ప్రకాష్‌యాదవ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి ఆన్‌లైన్‌లో స్థానికేతురాలి పేరు

● ఆలస్యంగా వెలుగు చూసిన వైనం



గురవరాజుపల్లె వద్ద హైవేకి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని శుభ్రం చేసిన దృశ్యం

రేణిగుంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రెవెన్యూ శాఖలో జరిగిన లీలలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. రేణిగుంట మండలం గురవరాజుపల్లి తెలుగు గంగ రోడ్డులో అప్పటి పాత సర్వే నెంబర్ల ప్రకారం.. గురవరాజుపల్లి లెక్క దాఖల సర్వేనెంబర్ 99/3లో 4.01 ఎకరాలున్నాయి. విమానాశ్రయ పరిసరాల్లో భవిష్యత్తు అవసరాలకు జిల్లా రెవెన్యూ అధికారులు రిజర్వ్ చేసి ఉంచారు. 2018 వరకు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా ఉన్న ఇదే సర్వే నెంబర్‌ను 90/3 ఏగా మార్చి 3.02 ఎకరాలకు నళిని అనే మహిళ పేరిట రెవెన్యూ వెబ్ లాండ్‌లోకి ఎక్కించారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో మహిళ పేరు చూపుతున్న ఈ సర్వే నెంబర్‌పై తహసీల్దారు డిజిటల్ సంతకం చేయలేదు. అయినా కొంత మంది ఆ భూమిలోకి ప్రవేశించి శుభ్రం చేసినా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అసలు బయట ఊరికి చెందిన మహిళ పేరు వెబ్ లాండ్‌లోకి ఎవరు.. ఎలా.. ఏ హక్కుతో ఎక్కించారు? అనేదానిపై రెవెన్యూ అధికారులు విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనిపై తహసీల్దారు సురేష్ బాబును వివరణ కోరగా.. ఇప్పటి వరకు ఈ విషయం తన దృష్టికి రాలేదని, వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తిరుమలలో పచ్చదనాన్ని 80 శాతానికి పెంచుతాం



మొక్క నాటి నీళ్లు పోస్తున్న అదనపు ఈవో

తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో 70 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 80 శాతానికి పెంచేందుకు చర్యలు చేపట్టామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తిరుమలలోని గోగర్భం డ్యాం వద్దనున్న ఆక్టోపస్ భవనం వద్ద గురువారం ఆయన మొక్కలు నాటారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో రెండు వేల మొక్కలు నాటుతున్నట్టు చెప్పారు. మొత్తం లక్ష మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టామని, ఇప్పటికే మొక్కల కొనుగోలు ప్రక్రియ పూర్తయిందన్నారు. ఇప్పటికే ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నా.. పూర్తిగా ప్లాస్టిక్‌రహిత ప్రాంతంగా మార్చేందుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్లాస్టిక్ అనేది ఆరోగ్యానికి, పర్యావరణానికి పెద్ద శత్రువన్నారు. భక్తులు వాహనాల ద్వారా తీసుకువస్తున్న ప్లాస్టిక్‌ను కారు విండోల ద్వారా ఘాట్‌రోడ్లలో విసరడాన్ని గుర్తించామని, దీంతో అధికంగా ప్లాస్టిక్ పేరుకుపోతోందన్నారు. ఈక్రమంలోనే అలిపిరి చెక్‌పాయింట్ గట్టి తనిఖీలు చేయడంతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. భక్తులతో పాటు స్థానికంగా ఉండేవారు కూడా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలన్నారు. విదేశీ మొక్కలు నాటడం ద్వారా స్వదేశీ చెట్లకు హానీ కలుగుతోందన్నారు. అందులో భాగంగానే పూర్తిస్థాయిలో పరిశోధన చేసి 40 స్థానిక మొక్క జాతులను గుర్తించి నాటుతున్నామన్నారు. డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాసులు, డిప్యూటీఈవో సోమన్నారాయణ, ఈఈ సుధాకర్, డీఆర్వో, ఎఫ్ఆర్వోలు దొరస్వామి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లు, చేతులు కట్టేసి.. మహిళ మెడలో నగల అపహరణ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో దోపిడీ దొంగలు చెలరేగిపోతున్నారు. గిరిపురం కాలనీలో మహిళ కాళ్లు, చేతులు కట్టేసి మెడలో ఉన్న బంగారు నగలు అపహరించుకెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. గిరిపురం కాలనీకి చెందిన బాలచంద్ర గురువారం మధ్యాహ్నం తలుపులు తెరచి వాష్‌రూముకు వెళ్లాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు ఇంట్లోకి ప్రవేశించారు. ఆయన భార్య గిరిజతో మాటలు కలుపుతూ కొంతసేపటికి తాళ్లతో చేతులు, కాళ్లు కట్టేశారు. అరిస్తే చంపేస్తామని బెదిరించి మెడలో ఉన్న 40 గ్రాముల బంగారు చైను లాక్కొని పరారయ్యారు. వాష్‌రూము నుంచి బయటకు వచ్చిన భర్తకు ఆమె జరిగిన విషయం చెప్పింది. వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మురళీమోహన్ అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మెగా డీఎస్సీ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో శుక్రవారం నుంచి మెగా డీఎస్సీ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డీఎస్సీ పరీక్షలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షల కోసం జిల్లాలో 8 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఏడేళ్ల తర్వాత నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. లోపాలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. 33.607మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్సులో జరుగుతాయని, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు, జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్, అదనపు డీఎస్పీ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో బాలాజీ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీకి పటిష్ఠ భద్రత

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 8 కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

నూతన ఆర్ఐవోగా రాజశేఖరరెడ్డి



తిరుపతి(విద్య), జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యామండలి తిరుపతి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ)గా ఎ.రాజశేఖరరెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఆర్ఐఓగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి స్థానంలో జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న రాజశేఖర్‌ను నియమిస్తూ ఇంటర్ విద్యామండలి ఉత్తర్వులు వెలువరించింది. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు ఇంటర్ బోర్డు విధి విధానాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రవేశాలు, కళాశాలల్లో వసతి సౌకర్యాలు బోర్డు నియామవాళి ప్రకారం ఉండాలని చెప్పారు. అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను పెంచేందుకు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. అన్ని యాజమాన్య కళాశాలల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు.

హరియాణా ముఠా పక్కా ప్రొఫెషనల్!

- కర్ణాటకలోని కటికెన హళ్లి దోపిడీదారులతో టైఅప్
- పశువుల దొంగతనాల నుంచీ బ్యాంక్ దోపిడీల దాకా
- జల్లెడ పడుతున్న కుప్పం పోలీసులు
- థర్మో డ్రోన్, స్నైపర్ డాగ్స్‌తో గాలింపు ముమ్మరం




కుప్పం గ్రామీణ ప్రాంతాల్లో స్నైపర్ డాగ్స్‌తో గాలింపు - థర్మో డ్రోన్‌తో గాలింపు

కుప్పం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ఎస్‌ఐని వాహనంతో తొక్కించబోయి సీఐ ఫైరింగ్ చేయడానికి కారకులైన హరియాణాకు చెందిన అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల ముఠా పక్కా ప్రొఫెషనల్ అని తెలుస్తోంది. కర్ణాటక రాష్ట్రంలో దోపిడీ దొంగల స్థావరమైన కటికెన హళ్లితో ఈ ముఠాకు సంబంధాలున్నాయి. పశువుల దొంగతనాలనుంచి బ్యాంకు దోపిడీల దాకా ఇదీఅదీ అనే తేడా లేకుండా నేరాలకు పాల్పడే హరియాణా దోపిడీ దొంగలకోసం కుప్పం పోలీసులు జల్లెడ పడుతున్నారు. స్నైపర్ డాగ్స్‌తోపాటు చీకట్లో కూడా జీవమున్న ప్రాణిని గుర్తించగలిగే అత్యాధునిక థర్మో డ్రోన్‌తో గాలింపు ముమ్మరం చేశారు.

పలమనేరు చెక్ పోస్టు వద్ద తప్పించుకున్న ఐదుగురు హరియాణా దోపిడీ దొంగల ముఠా ప్రయాణిస్తున్న వాహనాన్ని కుప్పం వ్యవసాయ మార్కెట్టు యార్డు వద్ద కుప్పం పోలీసులు ఈనెల 3వ తేదీ రాత్రి అడ్డుకున్నారు. ఈ సమయంలో గుడుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులును వాహనంతో తొక్కించబోగా కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్ ఒక రౌండ్ కాల్పులు జరపడం తెలిసిందే. గాయపడ్డ డ్రైవర్‌తో చివరిదాకా కొనసాగలేని హరియాణా గ్యాంగ్, పరమసముద్రం చెరువు వద్ద వాహనాన్ని విడిచిపెట్టి పరారయ్యారు. అప్పట్నుంచీ కుప్పం సబ్ డివిజన్ పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. బుధ, గురు వారాల్లో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. డీఎస్పీ పార్థసారథి ఆధ్వర్యంలో కుప్పం రూరల్, అర్బన్ సీఐలు మల్లేశ్ యాదవ్, శంకరయ్య, ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది అదే పనిలో ఉన్నారు.



పోలీసు కాల్పుల్లో ఊడిపడ్డ హరియాణా గ్యాంగ్ వాహన భాగం

స్నైపర్ డాగ్స్‌తో దోపిడీ దొంగలకోసం కుప్పం పరిసర గ్రామాలు, గుట్టలు, అడవుల్లో వేట కొనసాగుతోంది. అంతే కాదు.. చీకట్లో సైతం జీవమున్న ప్రాణుల ఉనికిని పసిగట్టి ఫొటోలు తీయగలిగే అత్యాధునిక సాంకేతికత కలిగిన థర్మో డ్రోన్‌ను తెప్పించి దానితో సైతం జల్లెడ పడుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. అనుమానితులు ఎవరైనా ఉంటే వెంటనే సమాచారమివ్వాలని సందేశాలు పంపారు. దండోరా వేయించారు. హరియాణా గ్యాంగ్‌పై చిత్తూరు జిల్లాలో ఇప్పటికే 4 కేసులు నమోదయ్యాయి. పశువుల దొంగతనాలు, ఎర్రచందనం స్మగ్లింగ్, ఇళ్ల దోపిడీలు, ఏటీఎం దొంగతనాలు, బ్యాంకు దోపిడీలు వంటి అనేక నేరాలకు ఈ హరియాణా గ్యాంగ్ పాల్పడుతోంది. ప్రస్తుతమైతే జిల్లాలో దోపిడీలకోసం రాలేదని, రాష్ట్రాల సరిహద్దులు దాటే క్రమంలో పోలీసులు పసిగట్టి పట్టుకోవడానికి ప్రయత్నించగా తప్పించుకుని పరారయ్యారని తెలిసింది.

కటికన హళ్లి రూట్లో దోపిడీముఠా?

హరియాణాకు చెందిన గ్యాంగ్‌కు కర్ణాటక రాష్ట్రం బెంగళూరు జిల్లా హొస్కోట తాలూకా మాలూరు సమీపంలోని కటికన హళ్లితో సంబంధ బాంధవ్యాలున్నట్టు పోలీసు వర్గాలు నిర్ధారించుకున్నాయి. కటికన హళ్లి గ్రామం మొత్తం ప్రమాదకరమైన దోపిడీదారులే ఉంటారని కర్ణాటక రాష్ట్రమే కాదు, పొరుగున ఉండే ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల పోలీసు యంత్రాంగాలకు స్పష్టంగా తెలుసు.కరడుగట్టిన నేరస్తులైన కటికెన హళ్లి దోపిడీదారులతో హరియాణాకు చెందిన సుమారు 30 మంది దోపిడీదారులు చాలాకాలంనుంచి సంబంధాలు పెట్టుకున్నట్లు చెబుతున్నారు. ఈ గ్రామం కేంద్రంగానే హరియాణా గ్యాంగ్ తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. అందువల్లనే పోలీసు యంత్రాంగం ఆచితూచి వ్యవహరిస్తోంది. కుప్పం పరిసర గ్రామాలు లేదా కొండలు, గుట్టల్లో ఉంటే సరే, లేదదంటే హరియాణా దోపిడీదారుల ముఠా ఏదో మార్గంలో కటికెన హళ్లికి చేరిపోయి ఉంటుందని అనుమానిస్తున్నారు. అయితే ఈ గ్యాంగ్‌లో వాహన డ్రైవర్, సీఐ జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదకర స్థితిలో అతిడిని వదిలిపెట్టి కుప్పం పరిసరాలు విడిచిపెట్టి వెళ్లే ప్రసక్తే లేదని నమ్ముతున్నారు. అందువల్లనే గాలింపు ముమ్మరంగా జరుగుతోంది.

పోలీసుల అదుపులో గ్యాంగ్‌స్టర్

పోలీసులు ముమ్మరంగా చేసిన గాలింపు చర్యలు కొద్దిగా ఫలితం ఇచ్చినట్లే కనబడుతున్నాయి. సీఐ కాల్పుల్లో గాయపడ్డ హరియాణా గ్యాంగ్‌లోని డ్రైవర్, వాహనాన్ని తీసుకువెళ్లి పరమసముద్రం చెరువు దగ్గర ఆపి, మొత్తం అయిదుగురూ పరారైన విషయం తెలిసిందే. అలా పారిపోయినవారికోసం పోలీసులు చేసిన తీవ్రమైన గాలింపులో ఒక నిందితుడి ఆచూకీ దొరికినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ దోపిడీదారు పోలీసుల అదుపులో ఉన్నారంటున్నారు కానీ, ఈ విషయాన్ని అధికారులెవరూ నిర్ధారించడంలేదు.దోపిడీదారులు ప్రయాణించిన వాహనాన్ని కూడా 3వ తేదీ రాత్రే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డ నిందితుడు కచ్చితంగా కుప్పం పరిసరాల్లోనే ఎక్కడో షెల్టరు తీసుకుని చికిత్స పొందుతుంటాని పోలీసులు అనుమానిస్తున్నారు. అయిదుగురు నిందితులూ హిందీలోనే మాట్లాడుతున్నారని, పక్కా కరడుగట్టిన నేరస్తులని స్పష్టమవుతోంది.

అత్యాధునిక సాంకేతికత ఉపయోగించి గాలింపు

అత్యాధునిక సాంకేతికత ఉపయోగించి హరియాణా గ్యాంగ్‌కోసం గాలింపు చేపడుతున్నామని కుప్పం డీఎస్పీ పార్థసారథి తెలిపారు. చీకట్లో సైతం జీవమున్న ప్రాణులను పసిగట్టి వారి ఉనికిని పట్టించే థర్మో డ్రోన్‌తో ప్రస్తుతం రాత్రివేళల్లో కూడా గాలింపు జరుపుతున్నామన్నారు. మరోవైపు స్నైపర్ డాగ్స్‌తో సాగుతున్న గాలింపు ద్వారా దోపిడీ దొంగలు సంచరించిన మూడునాలుగు ప్రాంతాలను గుర్తించామన్నారు. ఎక్కడ ఎటువంటి అమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని ఆయన ప్రజలను కోరారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



ప్రతిభ చూపి, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో జరుగుతున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ముఖ్య అతిథిగా వచ్చిన మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ నాగసౌజన్య మాట్లాడుతూ.. స్పోకెన్ ఇంగ్లీష్, యోగా, అబాకస్, డ్రాయింగ్, బుక్ రీడింగ్‌పై పిల్లలకు శిక్షణ ఇవ్వడం బాగుందన్నారు. సమాజంలో ఆడపిల్లలు వ్యక్తిగత సమస్యలను ఎలా ఎదుర్కోవాలో ఇక్కడ నేర్పించడం జరిగిందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎస్ఎస్ శర్మ అన్నారు. రోజూ 60 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతోపాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కామన్ ఎగ్జామ్ బోర్డు కార్యదర్శి హేమాద్రి, డిప్యూటీ లైబ్రేరియన్ లలిత, అసిస్టెంట్ లైబ్రేరియన్ గజేంద్రబాబు, ఇంగ్లీష్ లెక్చరర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో రన్నరప్ చిత్తూరు

విజేతలుగా కృష్ణా, అనంతపురం జట్లు



పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన అనంతపురం జిల్లా జట్టు - మహిళల విభాగంలో విజేతగా నిలిచిన కృష్ణా జిల్లా జట్టు - రన్నరప్‌గా నిలిచిన చిత్తూరు జిల్లా పురుషుల జట్టు

చిత్తూరు క్రీడలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని మెసానికల్ మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ అండర్-23 మహిళ, పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు గురువారంతో ముగిశాయి. చిత్తూరు బాస్కెట్‌బాల్ అసోసియేషన్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 13 జిల్లాల జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో అనంతపురం, మహిళల విభాగంలో కృష్ణా జట్లు విజేతలుగా నిలిచాయి. పురుషుల రన్నరప్‌గా చిత్తూరు జట్టు, మూడో స్థానంలో ఈస్టుగోదావరి జట్టు నిలిచింది. మహిళల విభాగంలో రన్నరప్‌గా ఈస్ట్ గోదావరి, మూడో స్థానాన్ని వెస్ట్‌గోదావరి దక్కించుకుంది. విజేతలైన జట్లు కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్‌లో ఈనెల 12వ తేదీనుంచి జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిథ్యం వహిస్తాయని జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంగల్‌రాయనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు చిన్నికృష్ణ, సాయినాథ్, టీడీపీ నేత జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకంతా అందుబాటులోకి భూసార పరీక్ష కేంద్రం



పనులను పరిశీలిస్తున్న ఏడీ పరమేశ్వరన్

చిత్తూరు సెంట్రల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో రూ.12 లక్షల వ్యయంతో పునఃనిర్మిస్తున్న భూసార పరీక్ష కేంద్రం నెలాఖరుకంతా అందుబాటులో తీసుకురానున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్ తెలిపారు. కేంద్రంలో జరుగుతున్న పనులను గురువారం పరిశీలించిన ఆయన.. కాంట్రాక్టర్‌కు పలు సూచనిచ్చారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే జిల్లాలోని రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ వ్యవసాయం సాగు చేసే దిశగా భూసార పరీక్షలు పనికొస్తాయని చెప్పారు.

ఎమ్మెల్యేల కార్యాలయాల్లో నేడు ప్రజాదర్బార్

చిత్తూరు సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల కార్యాలయాల్లో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. ● చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే జగన్మోహన్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు స్వీకరిస్తారు. ● లక్ష్మీనగర్‌లోనే ఉన్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కార్యాలయంలోనూ ఉదయం 11 గంటల నుంచి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. ప్రజలు వినతిపత్రంతోపాటు ఆధార్ కార్డు జెరాక్స్ జతచేయాలని ఎమ్మెల్యేల కార్యాలయాల వర్గాలు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- జిల్లా జడ్జి అరుణసారిక



జిల్లా కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జిల్లా జడ్జి అరుణసారిక

చిత్తూరు లీగల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే తరాల వారికి మంచి వాతావరణాన్ని అందించడం కోసం ప్రతిఒక్కరూ తమ ఇంటి వద్ద మొక్కలు నాటాలని జిల్లా జడ్జి అరుణసారిక కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయమూర్తులతో కలిసి మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. డీఎల్ఎస్ఏ సెక్రటరి భారతి మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడడం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణ శాఖ అధికారులు రాజశేఖర్, కుమార్‌తో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పాలవ్యాను ఢీకొని లారీ డ్రైవర్ మృతి



రామలింగం (ఫైల్ ఫొటో)

పూతలపట్టు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పాలవ్యాను ఢీకొని ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పూతలపట్టు మండలం ఎం.బండపల్లెకు చెందిన గోవిందస్వామి కుమారుడు రామలింగం (63) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయన స్వగ్రామంలో ఉన్న ఓ కల్యాణ మండపంలో జరుగుతున్న బంధువుల పెళ్లికి వెళ్లాడు. గురువారం రాత్రి 11 గంటలకు తిరిగి ఇంటికి రోడ్డుపై నడిచి వెళుతుండగా కల్యాణ మండపం సమీపంలోనే చిత్తూరు నుంచి పీలేరు వైపు వెళుతున్న మినీ పాల వ్యాను ఢీకొంది.గమనించిన స్థానికులువెంటనే బాధితుడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై బండరాయితో దాడి

పుంగనూరు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో భర్త బండరాయితో తలపై దాడి చేయడంతో పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం కోడిపల్లెకి చెందిన గణేశ్ ములబాగళ్‌లో ఓ బేకరిలో పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈనేపథ్యంలో భార్య మమతపై అనుమానంతో మద్యం మత్తులో బండరాయితో తలపై వేసి చితకబాదడంతో మమత కేకలు వేసింది. గమనించిన స్థానికులు అక్కడకు చేరుకునే లోపు భర్త పరారు కావడంతో గాయపడిన ఆమెను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

30లక్షల మొక్కలు నాటడం అటవీ శాఖ లక్ష్యం



నీవా నగరవనంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సెంట్రల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణం కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక పెనుమూరు క్రాస్ వద్ద అటవీ శాఖ పశ్చిమ విభాగం పరిధిలోని నీవా నగరవనంలో డీఎఫ్‌వో భరణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.. అటవీ సిబ్బంది, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు అవసరమైన మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్‌తరాలకు మంచి ప్రకృతిని అందించిన వారమవుతామన్నారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ.. ఈఏడాది అటవీ శాఖ ద్వారా జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. దీనికి విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు భాగస్వాములు కావాలని కోరారు. అంతకు ముందు విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆర్‌వీఎస్ ఇతర కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అవ్వ మందలించిందని మనవరాలి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అమ్మమ్మ మందలించిందని మనవరాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం పెద్దపంజాణి మండలంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం గడ్డూరుకు చెందిన వెంకటరమణ కుమార్తె గాయత్రి (19) ఇంటి పనులు చేయలేదని అమ్మమ్మ మందలించింది. దీంతో పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు గాయత్రిని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

మధ్యాహ్న భోజన పథకానికి సన్నరకం బియ్యం




ఏర్పేడు గోదాములో సన్నరకం బియ్యాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాల సంస్థ డీఎం బాలకృష్ణ - సిద్ధమైన 25 కిలోల బ్యాగు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా జిల్లాలోని పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు అవసరమైన సన్నరకం బియ్యాన్ని ఈనెల నుంచి అందజేయనున్నారు. ఇప్పటివరకు రేషన్ బియ్యాన్నే వాడుతుండగా, ఇకపై బలవర్థకపు మేలురకం సన్న బియ్యాన్ని ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు.. సన్నరకం బియ్యాన్ని సేకరించి ఏర్పేడు బఫర్ గోదాములో నిల్వ చేశారు. ఈ బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ డీఎం బాలకృష్ణ పరిశీలించారు. అక్కడి నుంచి హాస్టళ్లు, పాఠశాలలకు తరలించడానికి వీలుగా 25 కిలోల బ్యాగులను సిద్ధం చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 14 మండలస్థాయి (ఎంఎల్) స్టాక్ పాయింట్లు ఉండగా, ఇప్పటివరకు ఎనిమిది పాయింట్ల నుంచి బియ్యం తరలింపు పూర్తయ్యింది. మరో ఆరు పాయింట్ల నుంచి శుక్రవారం ఉదయం తరలింపు ప్రక్రియ జరగనుంది. బియ్యం బ్యాగు సీల్ సక్రమంగా లేకపోయినా, ఎలాంటి లోపాలున్నా తీసుకోరాదని ప్రభుత్వం సూచించింది. ఈ బియ్యం బ్యాగులను బహిరంగ మార్కెట్‌లో విక్రయించినా లేదా కొనుగోలు చేసినా అటువంటివారు శిక్షార్హులౌతారని హెచ్చరించింది.

పరమహంస యోగానంద విద్యాలయంలో అమెరికా బృందం



శాంతిపురం, జూన్ 5: పరమహంస యోగానంద విద్యాలయాన్ని గురువారం అమెరికాకు చెందిన లెహిఘ్ విశ్వవిద్యాలయానికి చెందిన ఎరిక్ ఒబేసేకరే, థియోడర్ స్పియర్, ఎమ్మానజారియన్, లిలియాగనా, నాడ్జీలీ జిమెనెజ్ బీల్మాలు, అలాగే స్విస్‌బర్న్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ జాసన్ సార్జెంట్, ఎస్వీఎన్ఆర్‌కు చెందిన చందు బరోల్‌లు సందర్శించారు. పాఠశాలలోని అటల్ ల్యాబ్‌ను పరిశీలించారు. అందులో నిర్వహించబడుతున్న అభివృద్ధి అంశాల గురించి ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్‌ను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లోని అంశాలు పరిశీలించి ప్రశంసించారు. వీరితోపాటు అగస్త్య ఇంటర్నేషనల్ ఫాండేషన్ సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనటేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


నూతన బోరుకు పూజలు చేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని మోట్లచేను తొట్లమాంబ ఆలయం, గుడికొట్టాలు గ్రామంలోని మారెమ్మ ఆలయాల వద్ద నూతన బోరు, పైపులైన్లకు గురువారం ఆయన పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కావాల్సినన్ని నిధులను తాగునీటి ఎద్దడి నివారణకు కేటాయిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కడా సలహా మండలి సభ్యుడు రామచంద్ర, పంచాయతీ కార్యదర్శి శశికుమార్, స్థానిక నాయకులు యతిరాజులు, శివకుమార్, సంతానం, పళణి, మనోహర్, రాజ్‌కుమార్, కృష్ణప్ప, శ్రీనివాసులు, విభూషణ్, రాజ, గోవిందప్ప, వెంకటేశ్, రాజు, చిన్నతంబి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆయురారోగ్యాలు


కుప్పంలో యోగా ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆయురారోగ్యాలు సమకూరుతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్‌లు అన్నారు. కుప్పంలో గురువారం కడా ఆధ్వర్యంలో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండు కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి యోగాపై విద్యార్థులతో ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల, కడా పీడీ వికాస్ మర్మత్‌లు మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం మే 21 నుంచి ప్రారంభించి ఈనెల 21వ తేదీ వరకు యోగా దినోత్సవాలు నిర్వహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, టీడీపీ మున్సిపల్ ఇన్‌చార్జి రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి


ఆస్పత్రిలో వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని.. వారిపై బాధ్యతగా వ్యవహరించాలని పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. స్థానిక సీహెచ్‌సీలో నూతనంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. విగ్రహం ఏర్పాటు చేసిన దాతలు కృష్ణారెడ్డి, అజయ్ కుమార్ రెడ్డి, వెంకటరమణారెడ్డిలను ఆయన అభినందించారు. వైద్యాధికారిణి పుష్పకుమారి, సిబ్బంది, వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి


సూచనలిస్తున్న ఎంఈవో సిద్దరామయ్య

సదుం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ఏర్పాటులో రాజీపడకూడదని, నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంఈవోలు సిద్దరామయ్య, దామోదర సూచించారు. గురువారం స్థానిక ఎంపీపీ పాఠశాల ఆవరణలో భోజన నిర్వాహకులతో సమావేశమై పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9 నుంచి గంగమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవం

రామకుప్పం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల సరిహద్దుల్లోని కర్ణాటక గ్రామం రాజుపేటక్రాస్‌లోని గంగమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు గోపూజ, గంగపూజ, గణపతిపూజ, రక్షాబంధన అంకురార్పణ, వాస్తు, రక్షోజ్ఞ హోమాలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మంగళవారం ఉదయం వేదపారాయణం, భూప్రార్థన, కళశ స్థాపన కార్యక్రమాలు, మధ్యాహ్నం మహాచండీ యాగం జరుగుతాయని తెలిపారు. సాయంత్రం అమ్మవారి కొత్త ఉత్సవ విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతుదని పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు అభిజిత్ లగ్నంలో మహాకుంభాభిషేకం, అమమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేస్తామని తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

పుంగనూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడూరుపల్లె వద్ద వెలసిన లక్ష్మీనరసింహస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

యోగాంధ్ర నిర్వహణకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో భవాని, జిల్లా టూరిజం అధికారి గౌరి

చౌడేపల్లె, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పలమనేరు ఆర్డీవో భవాని పేర్కొన్నారు. గురువారం ఆమె జిల్లా టూరిజం అధికారి గౌరితో కలిసి ఈనెల 9న బోయకొండలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు స్థలాన్ని పరిశీలించారు. బోయకొండ కింద గాలిగోపురం వద్ద ఉన్న గోశాల సమీపంలోని స్థలాన్ని ఎంపిక చేశారు. 2 వేల మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, తహసీల్దార్ హనుమంతు, ఆలయ ఈవో ఏకాంబరం, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మోసాలను జనం మరువలేదు

శాంతిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జగన్ సంక్షేమ వాగ్దానాలతో నవరత్నాల మోసాలను జనం ఇంకా మరువలేదని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం శాంతిపురంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెన్నుపోటు, గొడ్డలివేటు జగన్‌కే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం ఏడాది పాలనలోనే 70 శాతం హామీలను అమలు చేయడాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేకనే విమర్శలు చేస్తున్నారన్నారు. వారి విమర్శలను ప్రజలు నమ్మరని తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న వెంకటపతి

పుంగనూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పిల్లలు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయులు, న్యాయవాది వెంకటపతి పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వేసవి కాలంలో వివిధ రకాల పోటీల్లో ప్రతిభ కనబరిచిన పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తక పఠనం చేసిన ప్రతిఒక్కరూ ఉన్నత స్థానానికి వెళ్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్‌కలాం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్ ఖాన్, దేశాధి ప్రకాశ్, తోటగిరిధర్, హరిమొదలియార్, గ్రంథాలయాధికారి తులసీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు తిరుత్తణి కొండపై ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

సోమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సోమల బంగారు తిరుత్తణి కొండపై కొలువుదీరిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మేల్నాటి పద్మావతమ్మ, రెడ్డి జనార్దన్, విశ్వనాథనాయుడు, పూల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హిడింబాసుర వధ

సోమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ భారతంమిట్టలో మహాభారత యజ్ఞం సందర్భంగా గురువారం హిడింబాసుర వధ కథను భాగవతారణి నాగరత్న భక్తులకు వివరించారు. ఉభయదారులు కోటకొండ లోకేశ్ పంచపాండవ విగ్రహాలకు అభిషేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

పెద్దపంజాణి ఏవోగా సురేంద్రరెడ్డి

గంగాధరనెల్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎంపీడీవో ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సురేంద్ర రెడ్డి.. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)గా పదోన్నతిపై పెద్దపంజాణికి బదిలీ అయ్యారు. గురువారం ఆయన రిలీవ్ అయ్యారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

● మహిళ అరెస్టు

రామకుప్పం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బోయనపల్లె గ్రామంలో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఓ మహిళను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... బోయనపల్లెకు చెందిన రత్నమ్మ(54) తన ఇంటి వద్దే కార్ణటక మద్యం విక్రయాలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. గురువారం ఉదయం ఎస్‌ఐ వెంకటమోహన్ తమ సిబ్బందితో దాడి చేసి ఇంటి ముందు దాచి ఉంచిన 25 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రత్నమ్మపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఘర్షణలు పడినా, అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్బరాయుడు హెచ్చరించారు. గురువారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో హిందూ, ముస్లిం సోదరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు, ముస్లింలు కలిసి మెలసి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న బక్రీద్ పండుగ జరగనుందని.. ఎలాంటి ఘర్షణలు లేకుండా ఉండాలని కోరారు. సమావేశంలో ముస్లిం మతపెద్దలు, హిందువులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఓ యువతి బుధవారం నుంచి కనబడలేదని యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కనుమరుగవుతున్న ఆర్టీసీ బస్టాండు


బస్టాండు ఆవరణలో ఆటోలు



ఆర్టీసీ బస్సులు నిలపడానికి డ్రైవర్ల ఇబ్బందులు

రొంపిచెర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండల కేంద్రంలో గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్టాండు కనుమరుగవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. స్థానిక పంచాయతీ కార్యాలయం పక్కన ఆర్టీసీ యాజమాన్యం భవన నిర్మాణంతో బస్టాండు ఏర్పాటు చేశారు. తిరుపతి, చిత్తూరు, పీలేరు, పుంగనూరు పట్టణాలకు బస్సు సౌకర్యాలు కల్పించారు. బస్టాండు స్థలంలో వారపుసంత దుకాణాలు పెట్టడం, ఆటోలు, ప్రైవేట్ వాహనాలు నిలపడం, ప్రయాణిలు వేచిఉండే స్థలంలో వ్యాపారాలకు దుకాణ సముదాయాలు నిర్మాణం చేయడం జరిగింది. ప్రయాణికుల సౌకర్యాలకు ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకులు శిథిలావస్థలకు చేరుకున్నాయి. బస్సులు రావడం తగ్గిపోయాయి. ఉన్న పీలేరు-రొంపిచెర్ల, గానుగచింత, పుంగనూరు బస్సులు బస్టాండు రాకుండా రోడ్డుపై నిలిచి వెళుతున్నాయి. ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తూ నష్టపోతున్నారు. సంబంధిత అధికారులు, నాయకులు ప్రజల సౌకర్యం కోసం చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్లపైకి మురుగునీరు..!

● పంచాయతీ పాలకుల నిర్లక్ష్యం ● అవస్థలు పడుతున్న ప్రజలు




చాంబర్ల నుంచి బయటకు ఉబికి వస్తున్న మురుగునీరు / చాంబర్ బ్లాక్ కావడంతో ఓ ఇంటి స్నానపు గదిలోకి చేరిన మురుగునీరు

రామకుప్పం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలో భూగర్భ డ్రైనేజీ నిర్వహణ విషయంలో పంచాయతీ పాలకుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంలా మారితోంది. ఆరున్నరేళ్ల క్రితం పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా నారా లోకేశ్ పట్టణంలో ప్రయోగాత్మకంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అప్పట్లో యుద్ధప్రాతిపదికన సుమారు రూ.6 కోట్లతో పట్టణం మొత్తం భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు దుర్వాసన, దోమల బెడద నుంచి విముక్తి కలిగింది. అయితే గత కొన్నేళ్లుగా డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణను పాలకులు గాలికొదిలేయడంతో తరచూ పలు చోట్ల చాంబర్లు బ్లాక్ కావడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్వాసన వెదజల్లుతోంది. వారం రోజుల క్రితం స్థానిక దిగువవీధిలోని నాగం చెరువుకు వెళ్లే వీధిలో పలు చాంబర్లు బ్లాక్ అయిపోయాయి. నాగం చెరువులోకి వెళ్లాల్సిన మురుగునీరు రోడ్డుపై ప్రవహించడమే కాకుండా అక్కడి ఇళ్లల్లోని స్నానపు గదుల్లోకి చేరుతోంది. దీంతో దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ పెద్దలు, అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి నాగం చెరువుకు వెళ్లే వీధిలో భూగర్భ డ్రైనేజీ దుస్థితిని పరిశీలించి సత్వరం ఆ సమస్య నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.

మార్కెట్ కమిటీలకు
పాలకవర్గాల నియామకం ఎప్పటికో..!



పలమనేరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

పలమనేరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా జిల్లాలోని మార్కెట్ కమిటీలకు పాలకవర్గాల నియామకం నేటికీ జరగక పోవడంతో వీటిపై ఆశించి ఎదురు చూస్తున్న కూటమి ప్రభుత్వంలోని నేతలకు నిరాశ ఎదురవుతోంది. జిల్లాలో కుప్పం, పలమనేరు, పుంగనూరు, బంగారుపాళ్యం, చిత్తూరు, పెనుమూరు, ఎస్ ఆర్ పురం, నగరి, రొంపిచెర్ల, సోమలలో మార్కెట్ కమిటీలు ఉన్నాయి. సాధారణంగా ఈ మార్కెట్ కమిటీలకు అధ్యక్షులుగా అధికారంలో ఉన్న నేతలను ప్రభుత్వం ఆయా శాసన సభ్యుల సిఫారసు మేరకు నియామకం జరుగుతుంది. అయితే మార్కెట్ కమిటీలకు ఎస్సీ బీసీ, ఓసీల రిజర్వేషన్ల ప్రాతిపదిక న జరుగుతుంది. రోస్టర్ పద్ధతిలో ఈ పాలకవర్గాల అధ్యక్షుల నియామకం, పాలకవర్గ నియామకం జరుగుతుంది. అందులోనూ కొన్నింటిని మహిళలకు కేటాయిస్తారు. మూడు నెలల క్రితమే మార్కెట్ కమిటీ పాలకవర్గాల నియామకం తెరపైకి రావడం రోస్టర్ పద్ధతిలో ఏఏ మార్కెట్ కమిటీకి ఏ కులానికి చెందిన వారిని పాలకవర్గాల్లో నియమిస్తారో అన్న విషయం వచ్చింది. అయితే కారణాలు తెలియదు గానీ నేటికీ జిల్లాలో ఇప్పటికీ పాలకవర్గాలు ఖరారు కాకపోవడంతో ప్రమాణ స్వీకారాలు జరగలేదు. మూడు నెలల క్రితం వచ్చిన సమాచారం మేరకు పలమనేరు మార్కెట్ కమిటీ బీసీ మహిళకు కేటాయించినట్లు ప్రచారం జరిగింది. దీంతో పలమనేరు నియోజకవర్గంలోని సీనియర్ నాయకులు ఈ పదవిని ఆశిస్తూ తమ సతీమణుల పేర్లను స్థానిక ఎమ్మెల్యే సిఫారసు చేస్తారని ఎదురు చూశారు. అయితే వీరి ఆశలు అడియాసలే అయ్యాయని తెలుస్తోంది. వివరాలను ఎమ్మెల్యే తీసుకుంటారని ఎదురు చూసినా నియోజకవర్గంలో దాదాపు మూడు దశాబ్దాలకు పైగా పార్టీకి విధేయులుగా ఉంటూ కష్టకాలంలోనూ, పార్టీ అధికారంలో లేనప్పుడు సైతం ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చుకొన్న నాయకులు తమ వివరాలను అడగలేదని పేర్కొంటున్నారు. అయితే తమకు రాకపోయినా పర్వాలేదు గానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొనసాగి తర్వాత టీడీపీలోకి వచ్చిన ఓ వ్యక్తికి పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమిస్తారని ప్రచారంలోకి రావడంతో సీనియర్ టీడీపీ నాయకులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఎమ్మెల్యే తమ సేవలను గుర్తించి అవకాశం ఇవ్వాలని పలువురు నాయకులు కోరుతున్నారు.

వృక్షాలే పర్యావరణానికి శ్వాసకోశాలు




కుప్పంలో మొక్కలు నాటుతున్న కంచర్ల, పలమనేరు: ఎలిఫెంట్ క్యాంపు ఆవరణలో, పుంగనూరు: మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి ఆరీఫా

కుప్పం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి వృక్షాలే శ్వాసకోశాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్‌లు అన్నారు. కుప్పం మండలం కంగుంది పంచాయతీ రిజర్వ్ ఫారెస్టులోని ప్రతిపాదిత మంకీ క్యాంపులో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొక్కలను నాటి నీళ్లు పోశారు. అనంతరం ఎమ్మెల్సీ కంచర్ల, పీడీలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని, నీటిని ఒడిసిపట్టి భవిష్యత్తు తరాలకు భద్రం చేయాలని పిలుపునిచ్చారు. మహిళలకు పర్యావరణ హితమైన జనపనార సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుప్పం అటవీ క్షేత్రాధికారి జయశంకర్, డీఆర్వో సమీర్ బాషా, కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లతో పాటు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● కుప్పం పురపాలక సంఘం ఆధ్వర్యంలో దళవాయికొత్తపల్లె చెరువు ఉద్యానవనం వద్ద మొక్కలు నాటారు.

● కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీసీఎన్ విద్యాసంస్థల అధినేత బీసీ.నాగరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ సుధాకరబాబు పాల్గొన్నారు.

● కుప్పం ఆర్టీసీ డిపో మేనేజరు గోపీనాథ్ ఆధ్వర్యంలో రెండు యూనియన్ల నాయకులు డిపో ఆవరణలో మొక్కలు నాటారు. డిపో అసిస్టెంట్ మేనేజరు దినేశ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

● కుప్పంలోని ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు.

● **కల్లూరు:** భవిష్యత్తు తరాల కోసం విరివిగా మొక్కలు నాటాలని డ్వామా ఏపీడీ మల్లికార్జున్ పిలుపునిచ్చారు. గురువారం పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి పంచాయతీలో ఉపాధి పథకంలో చేపట్టిన పంట కాలువల చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏపీడీ మల్లికార్జున్ ప్రారంభించారు. ఏపీవో సౌభాగ్యవతి, జేఈ కృష్ణ, టీఏలు జ్యోతీశ్వర్‌రెడ్డి, మహేంద్ర, ఎఫ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పలమనేరు ఆర్డీవో పి. భవాని పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలమనేరు సమీపంలోని మొసలిమడుగు వద్ద ఎలిఫెంట్ క్యాంపు ఆవరణలో ఆర్డీవో భవాని మొక్కలు నాటి నీరు పోశారు. పలమనేరు రేంజర్ నారాయణ, తహసీల్దార్ ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి. రమణారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

● పలమనేరు బాలికోన్నత పాఠశాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి , మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకరరావు, ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్ పాల్గొన్నారు. పలమనేరు కాకాతోపు వద్ద వైద్యాధికారిణి చందనప్రియ మొక్కలు నాటారు.

● **రామకుప్పం:** పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గొరివిమాకులపల్లె ఆయుష్మాన్‌భవ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. టీడీపీ రామకుప్పం-1 క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్‌రఫీ, తెలుగు యువత మండలాధ్యక్షుడు విశ్వనాథ్, వెంకటరెడ్డి, ప్రభాకర్, నారాయణస్వామి, కుమార్, వేణు పాల్గొన్నారు.

● **పుంగనూరు:** వాతావరణ కాలుష్యాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని న్యాయమూర్తి ఆరీఫా పిలుపునిచ్చారు. గురువారం కోర్టు ఆవరణలో అటవీశాఖాధికారులతో కలిసి మొక్కలు నాటారు.

● **చౌడేపల్లె:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ అధికారులతో కలిసి గురువారం బోయకొండలోని ఎకో టూరిజం పార్క్‌లో తహసీల్దార్ హనుమంతు 100 మొక్కలు నాటారు. ఎఫ్‌ఆర్‌వో శ్రీరాములు, ఎంపీడీవో లీలామాధవి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతులందరికీ రాయితీ వేరుశనగ విత్తనాలు


పలమనేరు మండలం పెంగరగుంటలో...

కల్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీతో పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ తెలిపారు. పులిచెర్ల రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, ధనంజయనాయుడు, ఏవో హరిప్రసాద్, రైతులు పాల్గొన్నారు. అలాగే ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి వైసీపీ నాయకులతో కలిసి విత్తనాలు అందించారు. ఏవో హరిప్రసాద్ నాధమునిరెడ్డి పాల్గొన్నారు.

● **పలమనేరు:** పెంగరగుంట రైతు సేవా కేంద్రం వద్ద గురువారం రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో సంధ్య, టీడీపీ నాయకులు నాగరాజరెడ్డి, జగదీష్‌నాయుడు, పెద్దబ్బ, అమరనాథరెడ్డి, గిరి, స్వతంత్రబాబు, రామచంద్రనాయుడు, దామోదర్, నక్షత్రయ్య, జయప్రకాష్ పాల్గొన్నారు.

● **రామకుప్పం:** గొరివిమాకులపల్లెలో రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. తెలుగు యువత మండలాధ్యక్షుడు విశ్వనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్‌రఫీ, నేతలు ప్రభాకర్, సోమప్ప, నారాయణస్వామి, వేణు, కుమార్ పాల్గొన్నారు.

● **సదుం:** మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద 40 శాతం ప్రభుత్వ రాయితీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేపట్టారు. ఏవో మాధవీలత పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** మండలంలోని


పుంగనూరు మండలం భీమగానిపల్లెలో...

భీమగానిపల్లె రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో రాజేశ్, నాయకులు మాధవరెడ్డి, విరూపాక్షి, రమణ, చైతన్యరాయల్, శ్రీనివాసులు, నాగరాజనాయక్, కృష్ణప్ప, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల:** మండలంలోని బొమ్మయ్యగారిపల్లె వద్ద వ్యవసాయాధికారి సుధారాణితో కలిసి నాయకులు గురువారం వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, ఏఈవో సుబ్రహ్మణ్యం, పుంగనూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సహదేవ, నాయకులు సిద్దయ్య, నాగరాజ, కిరణ్, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల సమస్య పరిష్కారం



ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్న సిబ్బంది

ఐరాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న నాగమవాండ్లపల్లెలో చాలా కాలంగా నెలకొన్న విద్యుత్ తీగల సమస్యను గురువారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ 24 గంటల్లో పరిష్కరించారు. గ్రామానికి సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ స్తంభాలు ఒరిగి పోయి.. తీగలు చేతికి అందేలా ఉన్నాయి. రైతులు పశువు మేపడానికి, పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉండేది. రాత్రి సమయంలో రైతులు తమ పొలాల వద్దకు వెళ్లాలంటే భయపడేవారు. బుధవారం ఏనుగుల దాడిలో మృతి చెందిన రైతు కుటుంబానికి ఆర్థిక సాయం అందించడానికి ఎమ్మెల్యే గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు ఈ సమస్యను తెలియజేశారు. స్పందించిన ఆయన వెంటనే విద్యుత్‌శాఖ డీఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. దీంతో ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

చిల్డ్రన్ పార్కులో పనుల పరిశీలన



సిబ్బందితో కలిసి పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో భరణి

చిత్తూరు సెంట్రల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ తూర్పు విభాగం చిల్డ్రన్స్ పార్కులో జరుగుతున్న 'అడ్వెంచర్స్' పనులను డీఎఫ్‌వో భరణి పరిశీలించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్ ఆధ్వర్యంలో గురువారం పార్కులో ఏర్పాటు చేసిన వనమహోత్సవానికి ఆమె హాజరై, అటవీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ.. కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలతో పిల్లల్లో ఆలోచనా శక్తి, శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసం, మనో స్థైర్యం కల్పించడానికి కలెక్టర్ నిధుల నుంచి రూ.9.90లక్షలతో పార్కులో కమాండో స్ట్రైక్, రోప్‌వే, త్రీస్టెప్స్, బ్యాలెన్సింగ్ వాక్, నెంబర్ వాక్, తదితర అడ్వెంచర్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే వీటిని కలెక్టర్ ప్రారంభిస్తారని తెలిపారు.

మహాభారత ఉత్సవాలకు ధ్వజారోహణం



ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వెదురుకుప్పం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చెంచుగుడి మహాభారత ఉత్సవాలకు గురువారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యురాలు బండి హరి, బండి విజయశేఖర్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. శుక్రవారం నుంచి ఈనెల 15వ తేదీవరకు రోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు వరకు మదనపల్లెకు చెందిన భాగవతారిణి జి.శారదచే హరికథా కాలక్షేపం జరుగుతుంది. రోజూ రాత్రి వీధి నాటకాలుంటాయి. ఆలయ ధర్మకర్త పూల పట్టాభిరామారెడ్డి, పూల వెంకటరమణారెడ్డి, బండి భరత్‌రెడ్డి, టీడీపీ నేత రావిళ్ల దేవరాజులునాయుడు, మొగిలయ్య పాల్గొన్నారు.

బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ప్రభావతి



గంగాధరనెల్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరుకు (సర్విరెడ్డిపల్లె బస్టాప్) సమీపంలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలకు కొత్త ప్రిన్సిపాల్‌గా సి.ఎఫ్. ప్రభావతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నెల్లూరు జిల్లా డక్కిలి గురుకుల పాఠశాల నుంచి బదిలీపై ఇక్కడికొచ్చారు. ఇప్పటివరకు ఈ పాఠశాల టీచర్ దమయంతి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేశారు.

మండల అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ దీప

నింద్ర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని ఎంపీపీ దీప అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నింద్ర మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వైద్యాధికారి నిరోషా, ఈవోపీఆర్‌డీ వెంకటేశులు, ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, హౌసింగ్ ఏఈ శ్రీధర్ రాజు, పంచాయతీ రాజ్ ఏఈ వీరభద్రం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివరామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్ రెడ్డి, ఎంఈవో వసుమతి దేవి, కొప్పేడు ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అనిల్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

నింద్ర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నింద్రలో గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం గెరిగను గ్రామ పొలిమేర్ల వరకు ఊరేగించారు. అనంతరం అమ్మవారికి పూజలు నిర్వహించి నడివీధిలో ప్రతిష్ఠించారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని గ్రామ పొలిమేరల్లో నిమజ్జనం చేయడంతో జాతర ముగిసింది. మాజీ మంత్రి ఆర్కే రోజా అమ్మవారిని దర్శించుకున్నారు.

యోగాంధ్రకు అధికారులు గైర్హాజరైతే చర్యలు!

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో భాగంగా మండలస్థాయిలో నిర్వహిస్తున్న సమావేశాలు, యోగా కార్యక్రమాల్లో అధికారులంతా విధిగా పాల్గొనాలనే నిబంధన ఉన్నప్పటికీ, కొందరు గైర్హాజరవుతున్నారు. దీన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది. అటువంటి అధికారులపై చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే రాష్ట్ర యోగాంధ్ర మానిటరింగ్ సెల్ నుంచి మండలాల వారీగా ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటున్న అధికారులు, గైర్హాజరౌతున్న అధికారుల వివరాలు సేకరిస్తున్నారు.

తోతాపురి టన్ను ధర రూ.12వేలకు తగ్గించొద్దు

● జైన్‌ఫామ్ ఫ్రెష్ ఫ్యాక్టరీ మేనేజర్‌ను కలిసిన రైతులు

గంగాధరనెల్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 'కలెక్టర్, ప్రజాప్రతినిధులు కలిసి తోతాపురి మామిడి కాయలు టన్నుకు రూ.12వేల ధర తీర్మానం చేశారు. దానికి తగ్గకుండా చూడండి' అని 100 గొల్లపల్లె జైన్‌ఫామ్ ఫ్రెష్ ఫ్యాక్టరీ మేనేజర్ దిలీప్‌శర్మను రైతులు కోరారు. ఫ్యాక్టరీ వద్ద సెక్యూరిటీ సిబ్బంది టన్నును రూ.5వేలకు కొనుగోలు చేస్తామని చెప్పారని ఆందోళన చెందిన రైతులు మేనేజర్ ను కలిశారు. రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని మామిడి రైతు యూనియన్ నేత వెంకటరెడ్డి కోరారు.

గంగాధరనెల్లూరులో అన్న క్యాంటీన్

● ఏర్పాటుకు స్థలం గుర్తించిన అధికారులు

గంగాధరనెల్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని మండల అధికారులు గుర్తించారు. ఈ ఏడాది మార్చి ఒకటో తేదీన గంగాధరనెల్లూరులో ప్రజావేదిక కార్యక్రమానికి సీఎం చంద్రబాబు విచ్చేసిన సందర్భంలో అన్నక్యాంటీన్ మంజూరు చేస్తానని ప్రకటించారు. ఈ క్రమంలోనే అన్న క్యాంటీన్ ఏర్పాటుకు అనువైన స్థలం ఎంపిక చేయాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో డీసీసీబీ బ్రాంచ్ గేటుకు ముందు భాగంలో ఉన్న ఎంపీడీవో క్వార్టర్స్ భవనాల్లో స్థలాన్ని గుర్తించారు. దీనిపై నివేదికను జిల్లా, రాష్ట్ర అధికారులకు పంపించారు. మొత్తానికి త్వరలోనే గంగాధరనెల్లూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటై పేదలకు తక్కువ ధరకే భోజనం లభించనుంది.

రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ

పాలసముద్రం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆముదాల సచివాలయంలో గురువారం వేరుశనగ విత్తన కాయలను ఏవో డిల్లీబాబు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

గుడిపాల: రామభద్రాపురంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్లహేమాద్రినాయుడు, గుడిపాల ఎంపీటీసీ గోళ్లహరిప్రసాద్‌చౌదరిలు రైతులకు విత్తన కాయలను పంపిణీ చేశారు. ఏవో మాధవి, దిలీప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్‌కు పరామర్శ

చిత్తూరు సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ కార్పొరేటర్ మురళిని మాజీ ఎమ్మెల్యే సీకే బాబు గురువారం పరామర్శించారు. జానకారపల్లెకు చెందిన మురళి కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు.

119 ఏళ్ల చరిత్ర.. ఇక కనుమరుగే..!





చిత్తూరులో ల్యాండ్‌మార్క్‌గా ఉన్న కోర్టు ముఖద్వారం, ప్రహరీ కనుమరుగుకానుంది. 1906లో నార్త్ ఆర్కాట్ డిస్ట్రిక్ట్ పేరుతో చిత్తూరులో సెషన్స్ కోర్టు ప్రారంభమైంది. దీనికి సంబంధించిన శిలాఫలకాన్ని ముఖద్వారానికున్న ప్రహరీకి రెండువైపులా ఏర్పాటు చేశారు. ఇపుడీ ప్రాంతంలో మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వంద అడుగుల రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ ముఖద్వారం, ప్రహరీని కూడా తొలగిస్తున్నారు. మొత్తానికి 119 ఏళ్ల చరిత్ర ఇకపై కనుమరుగు కానుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

వైభవంగా ఇంద్రవరదుడి చక్రస్నానం / శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం





వరదుడి చక్రస్నానానికి హాజరైన భక్తులు - పుణ్యకోటి విమానంలో స్వామివారు- ధ్వజావరోహణం చేస్తున్న అర్చకులు

యాదమరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని శ్రీదేవి భూదేవి సమేత వరదరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం చక్రస్నానం వైభవంగా జరిగింది. ఉదయం మూలవర్లకు పుష్పకైంకర్యం, సాయంత్రం స్నపన తిరుమంజనం, చక్రస్నానం తీర్థవారి, రాత్రి పుణ్యకోటి విమానం, ధ్వజావరోహణ కార్యక్రమాలు వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు నిర్విఘ్నంగా కొనసాగిన బ్రహ్మోత్సవాలు, వాహన సేవలు రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమంతో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్‌సుందరాచార్యులు, హేమంత్ కుమారాచార్యులు, కంకణం భట్టాచార్య, పవన్, భరత్, శ్రీరామ్, రమేష్, రవీంద్ర, రాజేష్ కుమార్, శ్రీకాంత్, దుర్గాప్రసాద్, హరికృష్ణ, ఆకాష్, అచ్యుత, ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి ద్వాదశి ఆరాధన, పుష్పపల్లకి జరగనుంది. శనివారం ఉదయం వడాయితోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

తూతూమంత్రంగా మండల సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న తహసీల్దార్ పార్థసారథి

యాదమరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన యాదమరి మండల సర్వసభ్య సమావేశంతో తూతూమంత్రంగా జరిగింది. ఎంపీపీ సురేష్ బాబు అధ్యక్షతన ఎంపీడీవో వేణు సమావేశం నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ, ఎక్సైజ్, ఆర్టీసీ, హార్టికల్చర్, పలు విభాగాల అధికారులు గైర్హాజరయ్యారు. గోకులం బిల్లులు ఎప్పుడు ఇస్తారని ఏపీవోని సర్పంచ్‌లు నిలదీశారు. తాగునీటి ఎద్దడి నివారణకు మంచినీటి బోర్లు మంజూరు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉషారాణిని కాశిరాళ్ల, కీనాటంపల్లె, మాధవరం సర్పంచ్‌లు కోరారు. తహసీల్దార్ పార్థసారథి మాట్లాడుతూ.. భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏవో చరిత మాట్లాడుతూ.. వేరుశనగ విత్తనాలు గతేడాది కంటే తక్కువ వచ్చాయని, త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. ఏనుగుల దాడుల నుంచి పంటలను రక్షించడానికి హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్‌ను కౌండిన్య అటవీప్రాంతంలో ఏర్పాటు చేయనున్నట్లు అటవీశాఖ ఎఫ్ఎస్‌వో మోహనమురళి తెలిపారు. మొత్తంగా సమావేశం గంటన్నరలో ముగించేశారు. వైస్ ఎంపీపీ రవీంద్రబాబు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



కార్వేటినగరం, పాలసముద్రంలో యోగాసనాలు వేస్తున్న మహిళలు

వెదురుకుప్పం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంత, మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని కార్వేటినగరం వెలుగు ఏపీఎం కవిత అన్నారు. గురువారం కార్వేటినగరం ఎంపీడీవో ఆవరణంలో యోగాంధ్రలో భాగంగా స్వయంసహాయక సంఘాల సభ్యులు యోగాసనాలు వేశారు. సీసీలు, సంఘమిత్రలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని తొమ్మిది సచివాలయాల పరిధిలో ఉన్న పాఠశాలల ఆవరణల్లోనూ ప్రజలకు యోగాపై శిక్షణ ఇచ్చారు. మూడ్రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి తెలిపారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

పెనుమూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతతో ఉండాలని టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు అన్నారు. గురువారం మధ్యాహ్న భజనం తయారు చేసే మహిళలతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్‌నాయుడు, హెచ్‌ఎం రమేష్‌బాబు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ: ముగ్గురికి గాయాలు



సంఘటన స్థలంలో వాహనాలు

వెదురుకుప్పం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం అమ్మపల్లె క్రాస్ రోడ్డు పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ముగ్గురికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. బాధితులను చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారని చెప్పారు. బాధితుల వివరాలు తెలియలేదన్నారు. ఈ విషయమై కార్వేటినగరం పోలీసులను వివరణ కోరగా.. ప్రమాదంపై తమకు సమాచారం లేదన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు



పుంగనూరు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు పట్టణంలోని ఓ యువతి బుధవారం నుంచి కనబడలేదని తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బోల్తాపడ్డ ట్రాక్టర్



శ్రీరంగరాజపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బసివిరెడ్డి సమీపంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై చెరకు లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఒకటి గురువారం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలవలేదు. స్థానికుల సాయంతో అందులోని చెరకును వేరే ట్రాక్టర్‌లో తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన కోదండ నాయుడు - సతీష్

పూతలపట్టు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రచెరువుపల్లెకు చెందిన కోదండ నాయుడు తన పొలం వద్దకెళ్లి పనులు ముగించుకుని, తిరిగి తన ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యంలో మొరవపాటూరు బస్టాప్ వద్దకొచ్చేసరికి చిత్తూరు నుంచి పీలేరు వైపు వెళ్తున్న లగేజీ వ్యాను ఢీకొట్టింది. ఆపై రోడ్డు పక్కన ఓ చెట్టును కూడా ఢీకొంది. ఈ ప్రమాదంలో కోదండనాయుడితోపాటు లగేజీ వ్యాను డ్రైవర్ సతీష్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం స్థానికులు 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ కృష్ణమోహన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద - సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ - మొక్క నాటుతున్న వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చిత్తూరు అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పుత్తూరు రోడ్డులో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ నరసింహ ప్రసాద్‌లతో కలిసి మొక్కలు నాటారు. ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, సీఎంఎం వెంకటరమణ, డీఈ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: చిత్తూరు గాంధీరోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ మొక్కలు నాటారు. చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర, డీఈలు ఆనంద్, ప్రసాద్, సేవాతత్పరుడు పార్థసారథినాయుడు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ● చిత్తూరు-తచ్చూర్ హైవేకు ఇరువైపులా ఎన్‌హెచ్ఏఐ అధికారులు మొక్కలు నాటారు. ఎన్‌హెచ్ఏఐ పీడీ కార్తిక్‌రెడ్డి, మేనేజర్ లహిర్, అధికారులు మణిప్రసాద్, హరీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమూరు: జడ్పీ హైస్కూల్, పులిగుండు వద్ద మొక్కలు నాటారు. డ్వామా పీడీ రాజశేఖర్, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, ఎంఈవో భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం కుప్పానిగుంట ప్రాంతంలో ఎఫ్ఆర్వో వెంకటసుబ్బయ్య మొక్కలు నాటారు. తహసీల్దార్ నాగరాజు, కూటమి నాయకులు మేశం రవియాదవ్, తిరుమలరెడ్డి, యువరాజు, యుగంధర్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న పీడీ రాజశేఖర్ - ఎన్‌హెచ్ఏఐ అధికారులు

ఐరాల(కాణిపాకం): వరసిద్ధుడి ఆలయ డార్మెటరీ వద్ద ఖాళీ ప్రాంతంలో మొక్కలను సిబ్బందితో కలిసి ఈవో పెంచలకిషోర్ నాటారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు ధనంజయ, హరిమాధవరెడ్డి, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

నగరి: పట్టణంలో జరిగిన కార్యక్రమంలో నగరి డీఎస్పీ అజీజ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఈఈ రాజశేఖర్, సీఐ విక్రమ్. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

యాదమరి: గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. ఎంపీడీవో వేణు, ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, ఏపీవో సంధ్యారాణి పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, బడుల ఆవరణల్లో మొక్కలు నాటారు. ఈవోపీఆర్డీ రమేష్, ఏపీవో మార్గరేట్, ఈసీ రాంమూర్తి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

గుడిపాల: మొగరాల పరిధిలో ఎంపీడీవో శిరీష ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సీఎస్ఆర్ కళాశాల వ్యవస్థాపకుడు లోకేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్ర మొక్కలు నాటారు. ఏపీవో శ్రీనివాసులు, జేఈ వందన పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రేపు బక్రీద్

చిత్తూరు కల్చరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముస్లింలు శనివారం బక్రీద్ పండుగను జరుపుకోనున్నారు. మహమ్మద్ ప్రవక్తను ప్రార్థించి పేదలకు దాన ధర్మాలు చేయనున్నారు. ఈ సందర్భంగా పొట్టేళ్లకు, మేకపోతులకు డిమాండ్ ఏర్పడింది. ఇవి సుమారు రూ.15వేల నుంచి దాదాపు రూ.80వేల వరకు ధర పలుకుతున్నాయి.

సీనియర్ అసిస్టెంట్‌కు పదోన్నతి

గంగాధరనెల్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎంపీడీవో ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సురేంద్రరెడ్డి.. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)గా పదోన్నతిపై పెద్దపంజాణికి బదిలీ అయ్యారు. గురువారం ఆయన రిలీవ్ అయ్యారు.

ఏలూరుకు డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి అమాస రాజశేఖర్ రెడ్డి గురువారం ఏలూరుకు బయల్దేరి వెళ్లారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు శుక్రవారం ఆప్కాబ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో అమాస పాల్గొననున్నారు.

ఇళ్లత్తూరు రోడ్డుకు మరమ్మతులు చేయండి



విజయపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చివ్వాడ నుంచి వెంకటాపురం మీదుగా ఇళ్లత్తూరు రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా వరవ కాలువ పూడిపోవడంతో వర్షపు నీరు ప్రవహించి రోడ్డు గుంతలు పడిందని వాపోతున్నారు. రోజూ ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

నగరి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నగరి రెవెన్యూ డివిజన్ పరిధిలోని మున్సిపాలిటీ, మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఆర్డీవో భవానీ శంకరి ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలకు ఆరుగురు హాజరయ్యారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వరి, వైద్యులు రమేష్, సీడీపీవోలు కృష్ణవేణి, వినతశ్రీ, సూపర్‌వైజర్లు శంకరమ్మ, సంగీత పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేసిన ముళ్లచెట్లు



పెనుమూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని గుంటిపల్లె చెరువు కట్టపై రోడ్డును ముళ్లచెట్లు కమ్మేశాయి. దీనివల్ల రోడ్డు సరిగ్గా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. పైగా మలుపు ఉండటంతో వాహనదారులు భయంతో ప్రయాణించాల్సి వస్తుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి చెట్లను తొలగించి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బంగారు తిరుత్తణి కొండపై ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

సోమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సోమల బంగారు తిరుత్తణి కొండపై కొలువుదీరిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. మూలవిరాట్‌కు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త మేల్నాటి పద్మావతమ్మ, రెడ్డి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.